
సాక్షి అనకాపల్లి

శనివారం, 30, ఆగస్టు, 2025

పలు రైళ్ల రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి విజయనగరం వద్ద శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పడంతో విశాఖ నుంచి బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దు చేశారు. వాల్తేర్ డీఆర్ఎం సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులను పూర్తిచేయించారు. సాయంత్రానికి ఇరు వైపులా ట్రాక్‌లపై రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. విజయనగరం-విశాఖపట్నం(67288) పాసింజర్, విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం(67289/ 67290)పాసింజర్, విశాఖ పట్నం-కోరాపుట్ (58538) పాసింజర్, విశాఖ పట్నం-బ్రహ్మపూర్(58532)పాసింజర్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-విజయనగరం(67287)పాసింజర్, విశాఖపట్నం-దుర్గ్(18530)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-దుర్గ్(22820) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రద్దు చేశారు. 30వ తేదీన కోరాపుట్-విశాఖపట్నం(58537) పాసింజర్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(58531) పాసింజర్ రద్దు చేశారు. ఈ లైన్‌లో పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశారు.

న్యూస్‌రీల్

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: తెలుగు భాష సంస్కర్తల్లో గిడుగు రామ్మూర్తి అగ్రగణ్యులని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు భాష తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసిన రామ్మూర్తి పంతులు అందించిన సేవలు నిరుపమానమన్నారు. వాడుక భాష ఉద్యమానికి ఆద్యులు, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్‌కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సాహితికి మేజర్ ధ్యాన్‌చంద్ అవార్డు



సాహితికి మేజర్ ధ్యాన్‌చంద్ అవార్డు బహూకరిస్తున్న రెక్టార్ మధుసూదనరావు

రోలుగుంట: సాహస బాలిక అవార్డు గ్రహీత సాహితికి జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశాఖలోని విజ్ఞాన్ విశ్వ విద్యాలయం తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా సాహితికి విశ్వ విద్యాలయ అధినేత రెక్టార్ మధుసూదనరావు మేజర్ ధ్యాన్‌చంద్ అవార్డు బహూకరించారు. దీనిపై సాహితి మట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని వివరించారు. తమ కుమార్తె సాధించిన విజయాలు తల్లిదండ్రులుగా తమకెంతో గర్వకారణమని ఇంగ్లిష్ టీచర్ నాగజ్యోతి దంపతులు పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ డేలో సిబ్బంది సమస్యల పరిశీలన



పోలీస్ సిబ్బంది సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే జరిగింది. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసి తమ సమస్యలు వివరించారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ చెప్పారు. మొత్తం 8 ఫిర్యాదులు అందాయి.

జనసైనికుల ముష్టి యుద్ధం



ఎమ్మెల్యేల సమావేశ ప్రాంగణంలోనే కొట్లాట

- డిప్యూటీ సీఎం పవన్ ప్రొటోకాల్ చైర్మన్‌కు దేహశుద్ధి
- రూ.25 లక్షలకే ఫ్లాట్లు ఇస్తానని వసూలు
- వాటిని వేరొకరికి రిజిస్ట్రేషన్
- ఒక ఎమ్మెల్యే అనుచరుడి నుంచి చేబదులుగా రూ.40 లక్షలు
- డబ్బు ఇవ్వకుండా తిరుగుతున్న తిరుమలరావు
- జనసేన సమావేశ మందిరంలో అతడిని చితకబాదిన బాధితుడు

విశాఖ సిటీ: జనసైనికుల మధ్య జరిగిన ముష్టి యుద్ధం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశ సమయంలోనే ఇద్దరు జన సైనికులు పిడుగుద్దులు కురిపించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. జనసేనాని పవన్ ప్రొటోకాల్ చైర్మన్‌పైనే తీవ్ర ఆరోపణలు ఆ పార్టీలో సెగలు పుట్టిస్తున్నాయి. తక్కువ ధరకే ఫ్లాట్ల విక్రయాల పేరుతో డబ్బు వసూలు చేసి వాటిని ఎక్కువ ధరకు వేరొకరికి అమ్మి సొమ్ముచేసుకున్నాడని పవన్ సన్నిహితుడిని సమావేశంలోనే చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని గురువారం బీచ్ రోడ్డులోని వైఎంసీఏ పక్కన ఉన్న ఒక హోటల్‌లో నిర్వహించారు.

దీనికి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశం జరిగే హోటల్‌లోనే పవన్‌కల్యాణ్ ప్రొటోకాల్ చైర్మన్ మల్లినేడి తిరుమలరావు, కాకినాడ జిల్లాకు చెందిన జనసేన ఎమ్మెల్యే అనుచరుడు ప్రసాద్ మధ్య తీవ్ర స్థాయిలో కొట్లాట జరిగినట్లు సమాచారం.

రూ.కోట్లకు కుచ్చుటోపి

గత ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి యాత్రకు ప్రొటోకాల్ చైర్మన్‌గా బిల్డర్ అయిన మల్లినేడి తిరుమలరావు అలియాస్ బాబీకి బాధ్యతలు అప్పగించారు. ఆ యాత్ర తర్వాత అతడి పదవి, హోదాపై స్పష్టత లేనప్పటికీ.. ఇప్పటికీ పవన్ పర్యటన బాధ్యతలు తానే చూసుకుంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. వృత్తిరీత్యా బిల్డర్ అయిన తిరుమలరావు భీమవరంలో వెంకటసాయి బిల్డర్స్ పేరుతో భారీ అపార్ట్‌మెంట్ నిర్మించి అనేక మందిని మోసం చేసినట్లు బాధితులు ఇప్పటికే కోర్టులో కేసులు సైతం వేశారు. అపార్ట్‌మెంట్ నిర్మాణ సమయంలో ఒకేసారి క్యాష్ ఇస్తే రూ.25 లక్షలకే ఫ్లాట్ ఇస్తానని చెప్పి అనేక మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇలా డబ్బు తీసుకున్న వారికి కాకుండా నిర్మాణం పూర్తయిన తర్వాత ఫ్లాట్లను అధిక ధరకు విక్రయించినట్లు చెబుతున్నారు. దీనిపై రూ.25 లక్షలు ఇచ్చిన వారు తిరుమలరావును ఏళ్లుగా అడుగుతున్నప్పటికీ.. పవన్ కల్యాణ్‌కు ఫండింగ్ చేశానని, ఆ డబ్బులు తిరిగి వచ్చిన వెంటనే ఇచ్చేస్తానని ఒకసారి, ఒక రిటైర్డ్ ఐపీఎస్ అధికారికి బినామీని అని త్వరలోనే అందరికీ ఇచ్చేస్తానని మరోసారి చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాకినాడ జిల్లాకు చెందిన జనసేన ఎమ్మెల్యే అనుచరుడు ప్రసాద్ అనే వ్యక్తి నుంచి చేబదులు కింద రూ.40 లక్షలు తీసుకుని రెండేళ్లుగా ఇవ్వకుండా తిప్పుతున్నట్లు సమాచారం.

సమావేశంలో చితక్కొట్టిన బాధితుడు

జనసేన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పవన్ కల్యాణ్ ప్రొటోకాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తిరుమలరావును జనసేన ఎమ్మెల్యే అనుచరుడు ప్రసాద్ పట్టుకున్నాడు. తన డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరగడంపై నిలదీశాడు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తిరుమలరావును కోపంతో చితక్కొట్టేశాడు. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల సమక్షంలో తీవ్ర స్థాయిలో కొట్లాట జరిగింది. అందులో చాలా మంది తిరుమలరావు వ్యవహారం తెలియడంతో వారు కల్పించుకోలేదు. కొంతమంది మాత్రం వ్యక్తిగత వ్యవహారాలు బయట చూసుకోవాలని సమావేశంలో కాదని వారిని వారించే ప్రయత్నం చేశారు. దీనిపై ప్రసాద్ మండిపడుతూ పవన్ కల్యాణ్‌కు ప్రొటోకాల్ చైర్మన్ అని చెప్పుకుంటున్న తిరుమలరావు పార్టీ సభ్యుడు కాదా? అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసిన వ్యక్తికి కీలకమైన బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించడంతో ఎవరూ నోరెత్తలేకపోయారు. ప్రసాద్ తనను తీవ్రంగా కొట్టినట్లు తిరుమలరావు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే తిరుమలరావు వ్యవహార శైలి తెలిసిన ఎమ్మెల్యేలు ఆ కేసు తీసుకోవద్దని పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని బాధితులు భావిస్తున్నారు. అయితే ఇప్పటికే తిరుమలరావు వ్యవహారం పవన్‌కు తెలిసినప్పటికీ.. ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోతున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది.

జనసేనలో అసంతృప్తి జ్వాలలు

- పార్టీ నేతలకు, కార్యకర్తలకు విలువ లేదని ఆవేదన
- ఎమ్మెల్యేలు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆక్రోశం
- ఎన్నికల్లో కష్టపడినా తమకు గుర్తింపు లేదని మండిపాటు
- వారిని బుజ్జగించడానికి కిందా మీదా పడిన పవన్ కల్యాణ్



విశాఖ సిటీ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో అసంతృప్తి జ్వాలలు పెల్లుబికాయి. కూటమి ప్రభుత్వంలో తమకు విలువ లేకుండా పోయిందని పార్టీ నేతలు ఆక్రోశం వెళ్లగక్కారు. ఎమ్మెల్యేలు, అధికారులు తమను కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేస్తే.. అధికారంలోకి వచ్చాక పక్కనపెట్టేశారని అధినేతనే నిలదీశారు. తమకు పదవులే కాదు.. కనీసం గుర్తింపు కూడా లేదని వాపోయారు. వారిని సముదాయించడానికి పవన్ కల్యాణ్ కిందా మీదా పడాల్సి వచ్చింది. జనసేన ప్లీనరీ సందర్భంగా రెండు రోజులుగా విశాఖలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో పవన్ కల్యాణ్ వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కూడా భేటీ అయ్యారు. ఇందులో నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వంలో తమ పరిస్థితులను, కష్టాలను అధినేత దృష్టికి తీసుకువెళ్లారు.

జనసైనికులు, వీర మహిళలే పార్టీకి బలం

జనసేన పార్టీ సైద్ధాంతిక భావజాలాన్ని నమ్మిన జనసైనికులు, వీర మహిళలే పార్టీకి బలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ఇచ్చే బలంతోనే జనసేన జాతీయ పార్టీ స్థాయికి ఎదిగేలా పనిచేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా, సిద్ధాంతాన్ని నమ్మే సమూహం కావాలని పిలుపునిచ్చారు. సినిమా అభిమాన బలాన్ని రాజకీయంగా వ్యవస్థీకృతం చేయాలి. ఎవరో ఒకరికి బాధ్యత అప్పగించడం తన ఉద్దేశం కాదని, పార్టీని సంస్థాగతంగా ఎందుకు బలోపేతం చేయలేకపోతున్నామని చాలా మంది అడుగుతున్నారన్నారు. కానీ జనసేనను భుజాన వేసుకుంటూ మోస్తున్నది జనసైనికులు, వీరమహిళలే అన్నారు. కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

కూటమిలో విలువ లేదు..

కూటమి ప్రభుత్వంలో జనసేన నేతలు, కార్యకర్తలకు కనీసం విలువ లేకుండా చేస్తున్నారని కొందరు అధినేతకు ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే వారి స్వప్రయోజనాలు చూసుకుంటున్నారని, తమను కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇక టీడీపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అధికారులు సైతం తమకు విలువ ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. పార్టీ కోసం కష్టపడితే ఇప్పటి వరకు పదవులు లేవని, గుర్తింపు కూడా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. మరికొందరు మాత్రం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువవుతోందని, దీని నుంచి బయట పడే విషయంపై పార్టీ పెద్దలు దృష్టిసారించాలని సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పార్టీ ఇంకా ఎదగాలని, ప్రస్తుతం ప్రభుత్వంపై వ్యతిరేకత కారణంగా ఆ ప్రభావం పార్టీపై కూడా పడుతోందని, ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినట్లు సమాచారం. అసంతృప్తితో ఉన్న నేతలు, కార్యకర్తలకు అధినేత పవన్ సర్దిచెప్పడానికి తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది.

3 వేల బస్సులు, 10 వేలమంది సిబ్బంది..

- స్త్రీ శక్తి పథకం అమలు చేయాలంటే ఇవి కావాలి
- లులూ షాపింగ్‌మాల్‌కు ఆర్టీసీ స్థలం కేటాయింపు తగదు
- ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి:

స్త్రీ శక్తి పథకం రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు కావాలంటే కొత్తగా 3 వేల బస్సులు, 10 వేల మంది సిబ్బంది కావాలని ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. వైఎంవీఏ హాల్లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.ఎల్.రాజు అధ్యక్షతన యూనియన్ జిల్లా స్థాయి రెండో మహాసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదని, ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు. విజయవాడలో లులూ షాపింగ్ మాల్‌కు ఆర్టీసీ స్థలాన్ని అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెం.137ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ, నాలుగు డీఏ బకాయిలు తక్షణమే మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ వేసే వరకు ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. పదోన్నతులు కల్పిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన వారికి, మృత్యువాత పడిన వారి కుటుంబ సభ్యులకు చెల్లించవలసిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను ఆప్కాస్ ద్వారా చెల్లించాలని ఆయన కోరారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 129 డిపో యూనిట్లలో, డీపీటీవో, ఈడీ ఆఫీసుల్లో, నాన్ ఆపరేషన్ యూనిట్లలో ఉన్న కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని, క్లరికల్ సిబ్బంది పనిచేసుకునేందుకు సరైన ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రింటర్లు సమకూర్చాలని కోరారు. యూనియన్ విజయనగరం జోన్ అధ్యక్షుడు కె.జె.శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, జోనల్ కోశాధికారి జి.తాతాలు, సహాయ కార్యదర్శులు వై.రాము, యు.ఎస్.నారాయణ, జోనల్ పరిధిలో వివిధ డిపోల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

యూనియన్ జిల్లా అధ్యక్షునిగా డి.ఎస్.మూర్తి, వర్కింగ్ అధ్యక్షునిగా వై.వి.ఎస్.కుమార్, జిల్లా కార్యదర్శిగా డి.ఎల్.రాజు, కోశాధికారిగా ఐ.ఎస్.బాబుతోపాటు మరో ఐదుగురు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్టు రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. కమిటీ పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

రెండు బార్లకే దరఖాస్తులు

- నర్సీపట్నంలో నిల్
- యలమంచిలిలో రెండు బార్లకు 8 దరఖాస్తులు
- నేడు కలెక్టరేట్‌లో లాటరీ

సాక్షి, అనకాపల్లి: అనుకున్నట్లే జరిగింది. జిల్లాలో రెండు బార్లకే దరఖాస్తులు వచ్చాయి. నర్సీపట్నంలో ఉన్న బార్లకు అసలు దరఖాస్తే రాలేదు. జిల్లా వ్యాప్తంగా 10 బార్లు ఉండగా వీటిలో ఆరు బార్లు జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి. ఇక జిల్లాలో నర్సీపట్నంలో రెండు, యలమంచిలిలో రెండు బార్లు ఉన్నాయి.

నర్సీపట్నంలో ఉన్న రెండు బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. యలమంచిలిలో ఉన్న రెండింటిలో ఒకటి జనరల్‌కు, మరొకటి గీత కార్మికులకు కేటాయించారు. 4 వంతున మొత్తం 8 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 26వ తేదీతో ముగియాల్సిన గడువును ప్రభుత్వం 29వ తేదీ శుక్రవారం వరకు పొడిగించింది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేదు. శనివారం ఉదయం అనకాపల్లి కలెక్టరేట్‌లో యలమంచిలి రెండు బార్లకు లాటరీ తీయనున్నారు. దరఖాస్తుదారులు సకాలానికి హాజరు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సుధీర్ తెలిపారు.

అనితమ్మ ఇలాకాలో అవినీతా?

- స్వయంగా ప్రస్తావించిన హోం మంత్రి
- సమీక్ష సమావేశంలో వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ
- తమను నిందించడంపై అధికారుల అభ్యంతరం
- అక్రమాల్లో అగ్రభాగం కార్యకర్తలదేనని గుసగుసలు

నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి పనికి ఒక రేటు పెట్టేశారు. ఏం జరుగుతుందో నాకు తెలియదనుకుంటున్నారా? అధికారుల అవినీతి అడ్డూ అదుపు లేకుండా పోతోంది.. అంటూ స్వయానా హోం మంత్రి వంగలపూడి అనిత చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంలోనే కాదు.. జిల్లాలోనే చర్చనీయాంశమయ్యాయి. గురువారం నక్కపల్లి వెలుగు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంలో హోం మంత్రి అధికారులనుద్దేశించి ఈ మాటలు అన్నారు. అక్రమాల్లో అగ్రభాగం కూటమి పార్టీల కార్యకర్తలదేనని, అదేమీ పట్టించుకోకుండా తమను తప్పు పట్టడంపై కొందరు మనస్తాపం చెందారు. మంత్రి అనుయాయుల అండ ఉండగా మనకేమిటని మరికొందరు ఈ విషయాన్ని లైట్ తీసుకున్నారు.

నక్కపల్లి:

'రెవెన్యూ, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ శాఖలలో అవినీతి విపరీతంగా జరుగుతోంది. సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఏ పని చేయాలన్నా ఒక రేటు పెట్టేశారు. బ్రోకర్ల ద్వారానే పనులు జరుగుతున్నాయం'టూ చాలామంది తనకు ఫిర్యాదు చేస్తున్నారని ఆమె అధికారులపై విరుచుకుపడ్డారు. నిఘా వర్గాల ద్వారా నియోజకవర్గంలో ఏం జరుగుతుందో ప్రతి రోజు తెలుసుకుంటున్నానని, పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అయితే మంత్రి ఇలాకాలోనే అవినీతి మూలాలున్నాయని.. కూటమి నాయకులు, ఆమె అనుచరుల నుంచే ఈ జాడ్యం మొదలయ్యిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చిట్టా విప్పితే బాగోతాలెన్నో..

వారు పేరు చెప్పి వీరు, వీరి పేరు చెప్పి వారు యథేచ్ఛగా దోచుకుంటున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఇవన్నీ బహిరంగ రహస్యమే అయినా సమావేశాల్లో విమర్శలు చేయడం ఎవరిని మభ్యపెట్టడానికి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- పట్టాదారు పాసు పుస్తకాల కోసం, ఆన్‌లైన్‌లో నమోదు కోసం వేలాది రూపాయలు గుంజుతున్నారు. తీరప్రాంతాల నుంచి సముద్రపు ఇసుక, కొండల నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వేసి తరలించేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో అయితే ప్రజలు నేరుగా వెళ్లి అధికారులను కలిసే అవకాశం ఉండటం లేదు. కూటమి కార్యకర్తలే బ్రోకర్ల అవతారమెత్తి అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో చోటా మోటా కార్యకర్తలు.. మీకు గృహాలు మంజూరు చేయిస్తాం, నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయిస్తామంటూ వేలాది రూపాయలు ముందుగానే గుంజుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి స్థలాల కోసం అర్జీలు స్వీకరించడంతోపాటు కొంత మొత్తాన్ని కూడా వసూలు చేస్తున్నారు.
- ఎక్సైజ్ శాఖలో అయితే అవినీతి తారస్థాయికి చేరుకుంది. గ్రామాల్లో ఇష్టానుసారం బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఎంఆర్‌పీ కంటే రూ.50లు అధికంగా వసూలు చేస్తున్నారు. షాపుల్లో లూజు అమ్మకాలు చేయరాదని నిబంధనలు ఉన్నప్పటికీ యథేచ్ఛగా జరుగుతోంది. దీని వల్ల మద్యం కల్తీ జరుగుతోందంటూ మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైసెన్స్ కలిగిన దుకాణ యజమానుల ప్రోత్సాహంతోనే విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటవుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అయితే ప్రభుత్వ పెద్ద ఒకరికి ఏటా మద్యం సిండికేట్ల నుంచి లక్షలాది రూపాయలు మామూళ్లు ఇస్తున్నామని, దాన్ని కవర్ చేసుకోవాలంటే బెల్టు షాపులు, ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించక తప్పదని సిండికేట్లు చెబుతున్నారు.
- ట్రాన్స్‌కో సిబ్బంది అయితే వేరే చెప్పక్కర్లేదు, మీటరు కోసం, వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటూ నెలల తరబడి కార్యాలయాల చుట్టు తిరగాల్సిందే. వేలాది రూపాయలు మామూళ్లు ఇస్తేనే గాని పనులు జరగడం లేదు.
- అనధికార లేఅవుట్లు వేస్తూ ప్రభుత్వానికి చెందిన పంట కాలువలను, గెడ్డలను ఆక్రమిస్తున్నారు. వాటి మీద అనుమతులు లేకుండా కల్వర్టులు నిర్మించి రాచమార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు మామూళ్లకు కక్కుర్తిపడి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్ శాఖలో కూడా అవినీతి రాజ్యమేలుతోంది.



సమీక్ష సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హోం మంత్రి అనిత

ఇలాంటివి 'మామూలే'..

మంత్రి అనుయాయులు, కూటమి పార్టీల నాయకులే ఈ జాడ్యానికి కారణం.. మనల్ని ఒక్కర్నే నిందిస్తే ఎలా.. ఇలాంటివి మామూలే అని అధికారులు లైట్ తీసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. కూటమి కార్యకర్తల్లో అవినీతిని ముందు అరికడితే తర్వాత అధికారుల్లో మార్పు వస్తుందన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.


కర్ర లేనిదే కాలు కదలదు

- రెండు కాళ్లూ సక్రమంగా పనిచేయవు
- 60 శాతం వైకల్యంతో 35 ఏళ్లుగా పెన్షన్
- తొలగిస్తున్నట్టు నోటీసు రావడంతో లబోదిబో





కర్ర సాయంతో అతి కష్టం మీద నడుస్తున్న కృష్ణ



గతంలో అందజేసిన మెడికల్ బోర్డు సర్టిఫికెట్

ఈ చిత్రంలో ఉన్నది భీశెట్టి కృష్ణ. మాడుగుల మండలం కస్పా జగన్నాథపురం గ్రామానికి చెందిన ఈ దివ్యాంగుడు నడిచేందుకు ఎంత అవస్థ పడుతున్నారో చూశారు కదా. ఆయనకు పుట్టుకతోనే వైకల్యం ఉంది. రెండు కాళ్లూ వంకరగా ఉంటాయి. దీంతోపాటు ఒక కన్ను కూడా కనిపించదు. దాదాపు 30 ఏళ్ల క్రితం 1996లో విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రిలో పరీక్షలు జరిపి మెడికల్ బోర్డు వారు వికలాంగ ధ్రువపత్రం అందజేశారు. 60 శాతం వైకల్యం ఉన్నట్టు వారు ధ్రువీకరించారు. 2007లో జారీ చేసిన సదరం సర్టిఫికెట్ కూడా ఉంది. ఈ దివ్యాంగుడు 1990 నుంచి పింఛను అందుకుంటున్నారు. అప్పట్లో నెలకు 50 రూపాయల చొప్పున జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా మనీయార్డర్ రూపంలో ఏడెనిమిది నెలలకు ఒకసారి పంపించేవారు. ఇటీవల ప్రభుత్వం తొలగించిన దివ్యాంగుల పింఛనుదార్లలో ఇతని పేరు కూడా ఉంది. రెండు కాళ్లు చచ్చుబడడంతో ఎక్కడికీ నడవలేరు. అతి కష్టం మీద లేచి నిలబడి కర్ర సహాయంతో పడుతూ లేస్తూ మూడు చక్రాల రిక్షా బండి మీద వెళతారు. 1990 నుంచి పింఛను పొందుతున్న తనకు అన్యాయంగా పెన్షన్ నిలిపివేశారని, 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని ఇటీవల నోటీసు పంపించారని చెప్పారు. పింఛను రద్దు కావడంతో తన గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని కృష్ణ 'సాక్షి' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పింఛను పునరుద్ధరించాలని కన్నీటితో వేడుకుంటున్నారు.

-మాడుగుల రూరల్

క్లుప్తంగా

కుంకుమ అలంకరణలో స్వయంభువుడు



చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కుంకుమ అలంకరణలో కార్యసిద్ధి వినాయకుడు దర్శనమిచ్చారు. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

త్వరలో డీఎల్‌డీవో జిల్లా కార్యాలయం ప్రారంభం



ఉద్యోగులతో మాట్లాడుతున్న కృష్ణ తేజ

అనకాపల్లి: కొత్తగా ఏర్పడిన జిల్లాలో జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు కొత్తూరు పంచాయతీ పరిధిలో సచివాలయం-1 భవనాన్ని పరిశీలించినట్లు పంచాయతీ రాజ్ రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. మండలంలో కొత్తూరు పంచాయతీ సచివాలయం-1ని, అక్కడే ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయతీ పరిధిలో గృహాల ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా చర్యలు తీసుకుని స్వర్ణ పంచాయతీ పేరుతో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. జిల్లా డీఎల్‌డీవో కార్యాలయం ఏర్పాటు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సందీప్, గ్రామ సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయిపోయిన పెళ్లికి బాజాలు

- వైఎస్సార్ సీపీ హయాంలో యాత్రీ నివాస్ నిర్మాణం
- ఎన్నికల సమయానికే 85 శాతం పనులు పూర్తి
- కూటమిలో నెమ్మదించిన పనులు
- ఇటీవలే నిర్మాణం పూర్తి.. బుకింగ్‌లు కూడా ప్రారంభం
- నేడు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ప్రారంభానికి హడావుడి



విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలన్నీ అయిపోయిన పెళ్లికి బాజాలు అన్నట్లే ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ కూటమి ప్రభుత్వమే చేపట్టినట్లు కలరింగ్ ఇస్తోంది. నెలల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాల పేరిట హడావుడి చేస్తుండడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా బీచ్ రోడ్డులో లుంబినీ పార్క్ ఎదురుగా పర్యాటక శాఖకు చెందిన యాత్రీ నివాస్ ప్రారంభోత్సవంలోను అదే పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.12.3 కోట్లతో యాత్రీ నివాస్ భవన నిర్మాణాలు చేపట్టగా అప్పట్లో 85 శాతం పనులు పూర్తయ్యాయి. దేశ విదేశీ పర్యాటకులకు వారి అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలతో నిర్మాణాలు ఎన్నికల సమయానికే దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి. స్టార్ హోటల్స్‌కు ధీటుగా చేపట్టిన భవన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక నెమ్మదించాయి. మొత్తం 4 అంతస్తుల భవనంలో 46 గదులు, రెస్టారెంట్ ఉన్న ఈ పర్యాటక హోటల్‌ను ప్రైవేటుకు ఇచ్చేందుకు ఇప్పటికే టెండర్లు సైతం ఆహ్వానించారు.

బుకింగ్‌లు మొదలయ్యాక ప్రారంభోత్సవమంట..

యాత్రీ నివాస్‌లో 42 ఏసీ గదులు ఉన్నాయి. వీటిని ఏసీ సూట్, ఏసీ డీలక్స్, ఏసీ ఎగ్జిక్యూటివ్ రూమ్‌లుగా విభజించారు. ఇందులో ఇప్పటికే బుకింగ్‌లు కూడా ప్రారంభించారు. ఇద్దరు టూరిస్టులకు ఏసీ సూట్ రూమ్ డిమాండ్‌ను బట్టి రూ.3,750 నుంచి రూ.4,200, ఏసీ డీలక్స్ రూ.4,625 నుంచి రూ.5,180 వరకూ, ఏసీ ఎగ్జిక్యూటివ్ రూమ్‌కి రూ.3,125 నుంచి రూ.3,500(ట్యాక్స్ అదనం) వరకూ వసూలు చేస్తున్నారు. రూమ్‌లతో పాటు అత్యాధునిక వసతులతో రెస్టారెంట్, బార్, వెయిటింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్ మొదలైనవి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఎక్కువగా పశ్చిమ బెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తరభారత దేశానికి చెందిన పర్యాటకులు బస చేస్తున్నారు. బుకింగ్ ప్రారంభించిన వారాల తర్వాత ఇప్పుడు ఈ హోటల్‌ను ప్రారంభించడానికి రాష్ట్ర పర్యాటక శాఖ కందుల దుర్గేష్ వస్తున్నారు. శనివారం ఆయన చేతుల మీదుగా యాత్రీ నివాస్ ప్రారంభోత్సవానికి హడావుడి చేస్తున్నారు. అయిపోయిన పెళ్లికి బాజాలు అన్నట్లు.. బుకింగ్‌లు ప్రారంభమయ్యాక కూడా మంత్రి దుర్గేష్ ప్రారంభోత్సవానికి రావడం పట్ల పర్యాటక శాఖలో సిబ్బందే విస్తుపోతున్నారు.

కూత ఉత్కంఠగా..



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైభవ్ సూర్యవంశీ, పుల్లెల గోపీచంద్, ధనరాజ్ పిళ్లై



విశాఖ స్పోర్ట్స్: విశాఖ పోర్టులో శుక్రవారం రాత్రి ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ ఆరంభమైంది. అభిమానుల కోలాహలం, సందడి వాతావరణం మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 38-35 తేడాతో తెలుగు టైటాన్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. చివరివరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో ఇరు జట్లు నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. ప్రోకబడ్డీ లీగ్ పన్నెండో సీజన్‌ను తమిళ్ తలైవాస్ జట్టు శుభారంభంతో ప్రారంభించింది. మ్యాచ్ ఆఖరి క్షణంలో తలైవాస్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ తన మాజీ జట్టుపై చేసిన సూపర్ రైడ్తో విజయం సాధించారు. ఒక దశలో టైటాన్స్ 27-20 ఆధిక్యంతో విజయం సాధించేలా కనిపించినా, చివరిలో తడబడింది. తలైవాస్ తరపున స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ 12 పాయింట్లతో సూపర్ టెన్ సాధించాడు. తెలుగు టైటాన్స్ జట్టులో ఆల్‌రౌండర్ భరత్ 11 పాయింట్లతో రాణించినా ఫలితం దక్కలేదు. కెప్టెన్ విజయ్ మాలిక్ 6 పాయింట్లు, డిఫెండర్ శుభం షిండే 4 పాయింట్లు సాధించారు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు జరిగిన జాతీయగీతాలాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ఐపీఎల్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హాకీ ఆటగాడు ధనరాజ్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు. శనివారం తెలుగు టైటాన్స్ జట్టు యూపీ యోధాస్‌తో తలపడనుంది. శనివారం జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ తలపడనుండగా మరో పోటీలో యు ముంబా జట్టుతో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. మరో మ్యాచ్‌లో బెంగళూర్ బుల్స్ జట్టుపై పునేరి పాల్టన్ జట్టు విజయం సాధించింది.

వంటా వార్పుతో క్వారీ బాధితుల నిరసన



నిరసన తెలుపుతున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ బాధితులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద వర్షంలో వంటా వార్పు చేస్తూ నిరసన తెలిపారు. క్వారీ బాధితుడు అప్పారావు మాట్లాడుతూ 38 రోజులుగా తాము నిరాహార దీక్షలు చేస్తున్నా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కానీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. క్వారీ వల్ల తమ భూములు నాశనమవుతున్నాయన్నారు. దళిత రైతుల భూములను కాపాడాలని, క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ ఇప్పటికైనా తమ సమస్యను పరిగణనలోకి తీసుకుని అధికారులకు సిఫారసు చేసి క్వారీ అనుమతులు రద్దు చేయించాలని డిమాండ్ చేశారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం అప్పగింత



జీసీసీ అధికారులకు స్థలం అప్పగిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ, సర్వే సిబ్బంది

మాకవరపాలెం: కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ వెంకటరమణ జీసీసీ అధికారులకు అప్పగించారు. గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఈ యూనిట్ నిర్మాణానికి ఈనెల 9న పాడేరులో వర్చువల్‌గా సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం 11 ఎకరాల భూమిని తహసీల్దార్ వెంకటరమణ జీసీసీ అధికారులు విశ్వనాథం, వంశీలకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, సర్వేయర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సీఎండీకి ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకుంటున్న ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్

పరవాడ: స్థిరమైన విద్యుత్ ఉత్పత్తిలో ఎన్టీపీసీని అగ్రగామిగా నిలపడంలో విశేష కృషి జరిపిన ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం జరిగిన స్కోప్ ఎమినెన్స్ అవార్డుల కార్యక్రమంలో ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్‌కు వ్యక్తిగత నాయకత్వ ఎక్స్‌లెన్స్ అవార్డును భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఎన్టీపీసీ ఇంధన పరివర్తనను నడిపించడంలోను.. దాని క్లీన్ ఎనర్జీ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడంలోను.. స్థిరమైన విద్యుదుత్పత్తిలో కంపెనీని అగ్రగామిగా నిలబెట్టడంలో గుర్దీప్ సింగ్ చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది.

వేతనాలిప్పించాలని ఫిర్యాదు



ఐనాక్స్ కంపెనీని పరిశీలిస్తున్న కార్మికశాఖ అధికారి బాలకృష్ణ

యలమంచిలి రూరల్: రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తున్నా తమకు కొన్ని నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ అచ్యుతాపురం సెజ్ ఐనాక్స్ కంపెనీలో పని చేస్తున్న 18 మంది కార్మికులు శుక్రవారం యలమంచిలి సహాయ కార్మిక శాఖాధికారి కేపీ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ కార్మికులతో పనులు చేయిస్తున్న ఎస్‌సీఎల్ సంస్థ కాంట్రాక్టర్ నిర్ణీత సమయానికి వేతనాలు ఇవ్వకపోవడంతో తామంతా బతకడానికి, కనీస అవసరాలకు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నట్టు ఆయనకు తెలిపారు. కార్మికులిచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన వెంటనే అచ్యుతాపురం ఐనాక్స్ సంస్థకు వెళ్లి సంబంధిత కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. వెంటనే కార్మికులకు వేతనాలు చెల్లించాలని సూచించినట్టు బాలకృష్ణ తెలిపారు.

వాహనమిత్ర పథకం అమలుకు ఆటో డ్రైవర్ల డిమాండ్



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న పడాల గోవింద్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేస్తామని చెప్పిందని, ఏడాది దాటినా నేటికీ అమలు చేయలేదని ఏపీ డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, డ్రైవర్లకు ప్రమాదకరంగా మారిన జీవో నంబర్ 21, 31లను తక్షణమే రద్దు చేయాలని, డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించి, పోలీస్, ఆర్డీవో అధికారుల నమోదు చేసిన అక్రమ కేసులు తక్షణమే ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో ఏపీ డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షునిగా పెదిరెడ్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షునిగా కోన లక్ష్మణ, ఉపాధ్యక్షులుగా మార్కండేయులు, ఎ. కుమార్, ప్రధాన కార్యదర్శిగా కోరిబిల్లి జగదీష్, సహాయ కార్యదర్శిగా సూరి శెట్టి బాపునాయుడు, కోశాధికారిగా కె.నాగరాజుతో పాటు మరో ఐదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

డ్రోన్ నిఘాకు చిక్కిన మందుబాబులు



ఆర్టీసీ బస్సును తనిఖీ చేస్తున్న సీఐ రేవతమ్మ, సిబ్బంది

నర్సీపట్నం: రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ రాజారావు, సిబ్బంది శుక్రవారం గబ్బాడ, నెల్లిమెట్ట, రావణాపల్లి, ఏటిగైరంపేట ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ఎగరేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. చింతపల్లి వైపు నుండి వచ్చే వాహనాలను సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ప్రధానంగా డౌనూరు చెక్‌పోస్ట్ పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా చేసే ప్రత్యామ్నాయ మార్గాల్లో డ్రోన్ సహాయంతో తనిఖీలు చేపట్టామని సీఐ తెలిపారు.

మహిళకు విద్యుదాఘాతం

అనకాపల్లి టౌన్: విద్యుత్ వైర్లు తగిలి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తుమ్మపాల శివారు ఒక బట్టల దుకాణంలో తుమ్మపాల గవరపేట వీధికి చెందిన కె. రమ్య (21) గత కొంత కాలంగా పని చేస్తోంది. విధుల్లో భాగంగా కింది ఫ్లోర్ నుంచి పై ఫ్లోర్‌కు బట్టల స్టాండ్ తీసుకెళ్తుండగా సమీపంలో ఉన్న హైటెన్షన్ లైన్ విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైంది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతోంది.

పంట కాలువలో పడి మహిళ మృతి



పంట కాలువలో తేలిన రాము మృతదేహం, మృతురాలు నడిగట్ల రాము (ఫైల్)

యలమంచిలి రూరల్: పొలం పనుల కోసం చేనుకు వెళ్లి వస్తున్న మహిళ పంట కాలువ దాటుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన యలమంచిలి మండలం తురంగలపాలెం సమీపంలో చోటు చేసుకుంది. యలమంచిలి రూరల్ పీఎస్ పరిధి తురంగలపాలేనికి సమీపంలో నడిగట్ల అప్పారావు పంట పొలం, చేను ఉన్నాయి. రోజూ లాగానే గురువారం రాత్రి 7 గంటల సమయంలో చేనుకు వెళ్తున్న అప్పారావు భార్య నడిగట్ల రాము (50) చేను నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో పంట కాల్వ దాటుతూ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడింది. ఎంత సేపైనా భార్య ఇంటికి రాకపోవడంతో భర్త, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడ వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. చివరకు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రాము మృతదేహం పంట కాల్వలో తేలుతూ కనిపించింది. మృతురాలి భర్త అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం. ఉపేంద్ర తెలిపారు. ఈ ఘటనతో తురంగలపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేటలో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగయ్యపేట గ్రామానికి చెందిన కొట్యాడ అచ్చిబాబు (38) గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అచ్చిబాబు శుక్రవారం మరణించాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు.

సచివాలయంలో చోరీ

యలమంచిలి రూరల్: పట్టణంలోని నెహ్రూనగర్ వార్డు సచివాలయంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సచివాలయం ప్రధాన ద్వారం గడియ కోసి లోపలికి ప్రవేశించి రెండు కంప్యూటర్ మానిటర్లు, రెండు సీపీయూలు, కీ బోర్డు పట్టుకుపోయారు. చోరీపై సచివాలయ శానిటరీ కార్యదర్శి మోటూరు నరేంద్ర పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం 5 గంటలకు రోజూలాగే విధులు ముగించుకుని సచివాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. తిరిగి శుక్రవారం ఉదయం విధులకు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కె. సావిత్రి శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపారు. చోరీ సమాచారం అందుకున్న వెంటనే పట్టణ పోలీసులు, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు నెహ్రూనగర్ సచివాలయానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు నిందితుల వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం: సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో సీఐలు, ఎస్ఐలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీతో కేసులు పరిష్కరించుకోవటం వల్ల ఎవరికీ మనస్పర్థలు, డబ్బు ఖర్చు ఉండదన్నారు. ఈ ఆరు నెలల వ్యవధిలో నమోదైన పోక్సో కేసులపై స్టేషన్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

75 మంది కార్యదర్శులకు బదిలీ

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో గ్రేడ్-6 సచివాలయ కార్యదర్శులకు గత రెండు రోజులుగా డీపీవో కార్యాలయంలో పదోన్నతులు, బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 75 మంది సచివాలయ కార్యదర్శులకు బదిలీ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రెండో రోజు కొనసాగిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

ఉక్కునగరం: డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 642 మంది అభ్యర్థులు ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఐదుగురు అభ్యర్థుల కుల ధృవీకరణ పత్రాల్లో తేడా ఉండటంతో ఒక రోజు గడువిచ్చారు. ఆర్‌జేడీ విజయభాస్కర్, స్టేట్ అబ్జర్వర్ దేవానంద రెడ్డి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతున్న తీరును పరిశీలించారు.

57 బార్లకే దరఖాస్తులు

- జిల్లాకు 121 బార్లు కేటాయింపు. గీత కులాలకు మరో 10
- వాటిలో 57 బార్లకే నాలుగేసి చొప్పున దరఖాస్తుల రాక
- నేడు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో లాటరీ

విశాఖ సిటీ: అనుకున్నట్లే జరిగింది. జీవీఎంసీ పరిధిలో సగం బార్లకు కూడా దరఖాస్తులు రాలేదు. కేవలం 57 బార్లకే నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం కొత్త బార్ పాలసీ ప్రకారం విశాఖ జిల్లాలో జనరల్‌కు 121 బార్లు, గీత కులాలకు మరో 10 బార్లు కేటాయించింది. ముందుగా ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించగా కేవలం 44 బార్లకు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రభుత్వం శుక్రవారం వరకు గడువు పొడిగించింది. అయినప్పటికీ ఆశించిన స్థాయి స్పందన లేదు. మొత్తంగా 57 బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన వాటికి రాలేదు. అయితే గీత కులాలకు కేటాయించిన పది బార్లకు పూర్తిస్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. జనరల్‌లో 57 బార్లకు, గీత కులాలకు సంబంధించి 10 బార్లకు శనివారం ఉదయం లాటరీ తీయనున్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 8 గంటలకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో లాటరీ జరగనుంది. దరఖాస్తుదారులు 7.30 గంటలకే చిల్డ్రన్స్ థియేటర్‌కు హాజరుకావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ప్రసాద్ సూచించారు.

డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం



డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఏయూక్యాంపస్ : బీచ్‌రోడ్డులో శుక్రవారం హాప్ ఆన్-హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కొద్ది దూరం ప్రయాణించారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు దాదాపు 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో ఈ బస్సులు తిరుగుతాయి. నగరానికి వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించే విధంగా బస్సు ప్రయాణం ఉంటుందన్నారు. ఈ బస్సుల్లో ప్రాథమికంగా 24 గంటల ప్రయాణానికి రూ.500 ఉండగా టికెట్ చార్జీలో సగం మొత్తాన్ని ప్రభుత్వం భరించనుందన్నారు. విశాఖ ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నాలజీ హబ్‌గా ఎదుగుతోందన్నారు. విశాఖలో డేటా సెంటర్, సీ కేబుల్ ఏర్పాటు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి అనిత, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ శ్రీభరత్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్సు స్టేషన్ ఆవరణలో సీసీరోడ్డు పనులు


రోడ్డు నిర్మాణానికి వేసిన మెటీరియల్

కశింకోట: స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణలో సిమెంట్ రోడ్డు వేసే పనులు చేపట్టారు. ఈ మేరకు మార్కింగ్ మేరకు గొయ్యి తీసి వాటిలో మెటీరియల్ సిద్ధం చేశారు. దీనికి రూ.20 లక్షల జిల్లా పరిషత్ నిధులు మంజూరు కావడంతో నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బస్సు స్టేషన్ ఆవరణలో ఏ మాత్రం వర్షం వచ్చినా నీరు నిలిచిపోయి బురదమయంగా మారుతోంది. బస్సులు ఎక్కి, దిగడానికి ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకనైనా ఇది పూర్తయితే ఇబ్బందులు తొలుగుతాయని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేల్పులవీధిలో దశావతార వినాయకుడు


ఆకట్టుకుంటున్న దశావతార వినాయకుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల రథం షెడ్ పక్కన కొలువైన దశావతారం వినాయకుడి ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంటోంది. మహావిష్ణువు పది అవతారాలైన మత్స్యావతారం, కూర్మావతారం, ఆదివరాహావతారం, నరసింహావతారం, వామనావతారం, పరుశురామావతారం, శ్రీరామావతారం, బలరామావతారం, శ్రీకృష్ణావతారం, కల్కి అవతారాలతో దర్శనమిస్తున్న వినాయ విగ్రహానికి భక్తులు నిత్య పూజలు చేస్తున్నారు.

శేషజీవితాన్ని ఆనందంగా గడపాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి: పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆకాంక్షించారు. స్థానిక జీవీఎంసీ గాంధీనగరం హైస్కూల్లో హెచ్ఎం దువ్వూరి శ్రీనివాసరావు పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన హెచ్ఎం 40 సంవత్సరాలుగా వివిధ పాఠశాలల్లో పని చేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. అంతేగాకుండా జీవీఎంసీ గాంధీనగరం స్కూల్‌ను రాష్ట్రంలో ఉన్నత స్థానంలో నిలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ సాలాపు సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 14 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	4,700
రెండో రకం	---	---
మూడోరకం	---	---

అనకాపల్లి సినిమాలు

రాజా	:త్రిబాణధారి బార్బరిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	:బ్రహ్మాండ
పరిసాయి	:మహావతార్‌నరసింహం (మ్యాట్నీ, సెకండ్ షో)
పరిసాయి	:అర్జున్ చక్రవర్తి (మార్నింగ్ షో, ఫస్ట్ షో)
షిర్డీసాయి	:కూలీ
వెంకటేశ్వర	:బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య	:హరిహర వీరమల్లు
రామచంద్ర	:వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-40, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రోడ్లపై మురుగు

- వర్షాలతో అధ్వానంగా రహదారులు
- దోమల వృద్ధితో ప్రబలిన విషజ్వరాలు
- పారిశుధ్య నిర్వహణపై అధికారుల మొద్దు నిద్ర


తుమ్మపాల విద్యానగర్‌లో వృథాగా పారుతున్న కుళాయి నీరు


సత్యనారాయణపురం అండర్ బ్రిడ్జి కింద రోడ్డుపై పారుతున్న మురుగు


గాంధీనగరం హైస్కూల్ పక్క వీధిలో రోడ్డుపై మురుగు

తుమ్మపాల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో పట్టణంతోపాటు మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు మురుగుమయంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో మురుగు నిలిచిపోయినా జీవీఎంసీ, పంచాయతీల పారిశుధ్య సిబ్బంది సకాలంలో తొలగించడం లేదు. డ్రైనేజీల్లో సిల్టు తీయకపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలను రోగాల పాల్జేస్తున్నాయి. ప్రతి వారం ఫ్రైడే డ్రైడే ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు ఆర్భాటంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయడం లేదు. దీంతో సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్న రోగులు అప్పులు చేసి పట్టణ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

దోమలతో సావాసం

సాయంత్రమైతే చాలు దోమలు విపరీతంగా ముసురుకుంటున్నాయని, డ్రెయిన్లలో నీరు పారకపోవటంతో అవి దోమలకు ఆవాసాలుగా మారి కుట్టి పీడిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో గాంధీనగరంలో బీసీ వసతి గృహాల పరిసరాలతోపాటు, ఆర్అండ్‌బీ గెస్టుహౌస్ పరిసరాలు, లక్ష్మీదేవిపేట, శ్రీరామ్‌నగర్, మిర్యాల కాలనీ, తుమ్మపాల పంచాయతీలో చినబాబుకాలనీ, విద్యుత్ నగర్, తుమ్మపాలతోపాటు మండలలలో కొత్తూరు, శారదానగర్, ఎన్జీవోస్ కాలనీ, కొత్తూరు, పిసినికాడ, బీఆర్టీ కాలనీ, సత్యనారాయణపురం, మూలపేట, కుంచంగి, వేటజంగాలపాలెం, సంపతిపురం, సుందరయ్యపేట, అచ్చియ్యపేట, కూండ్రం, మెట్టపాలెం, తగరంపూడి, జగన్నాథపురం, వెంకుపాలెం, సీతానగరం, మామిడిపాలెం, బవులువాడ, దిబ్బపాలెం, ఊడేరు, మాకవరం, పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం, చేనులఅగ్రహారం, కోడూరు, గొల్లపేట, భూపతిపాలెం, కాపుశెట్టివానిపాలెం, సిహెచ్ఎన్ అగ్రహారం, రేబాక, గొలగాం, బట్లపూడి, తదితర గ్రామాలతో పాటు జగనన్న కాలనీల్లో డ్రైనేజీలు పూడిక పోయి నీరు పారడం లేదు. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్ల మీదుగానే మురుగు పారుతోంది.

సిల్టు తొలగిస్తున్నట్లు నివేదికలు..

ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో సిల్టు తొలగిస్తున్నట్లు సిబ్బంది అధికారులకు నివేదికలు ఇస్తున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం వాటి అమలు తూతూమంత్రంగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయి. మురుగు కాలువలు, అపారిశుధ్య ప్రాంతాలు దోమల వ్యాప్తికి ఆవాసాలుగా మారాయి. ఇటీవల కాలంలో విపరీతమైన దోమల వృద్ధి పెరిగింది. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరు ఆస్పత్రుల పాలవుతున్నారు. యాప్‌ల్లో ఫొటోలు అప్‌లోడ్ చేసి పరిసరాలన్నీ పరిశుభ్రం అన్నట్లు లెక్కా పత్రాలు లేని విధంగా నిధులు ఖర్చు చూపిస్తూ పాలకులతో కలిసి అధికారులు స్వచ్ఛభారత్ నిధులను మింగేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

జాడ లేని మలేరియా సిబ్బంది

మండలంలోని పీహెచ్‌సీల పరిధిలో మలేరియా క్షేత్రస్థాయి అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికి పల్లెల్లో గాని, కాలనీల్లో గాని వారానికి కనీసం ఒక్కసారైనా దోమల నివారణ మందును పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ప్రతి వారం డ్రైనేజీల్లో ఎంఎల్ ఆయిల్బాల్స్ వేయాల్సి ఉంది. దీనికి తోడు ప్రతి శుక్రవారం డ్రైడే ప్రచారం చేస్తున్న పీహెచ్‌సీ, పంచాయతీ సిబ్బంది కొంతకాలంగా ఆయా గ్రామాలు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేయడం లేదు. ఇంజినీరింగ్–ప్రజారోగ్య విభాగం, పంచాయతీ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) సిల్టు తొలగించాల్సి ఉన్నా, ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే తొలగిస్తున్నారు. మిగిలిన చోట్ల పట్టించుకోవడం లేదు. దీంతో యూజీడీ పొంగి రోడ్లపైకి చేరుకుని దుర్వాసన వెలువడుతోందని పలువురు వాపోతున్నారు.

ఘనంగా క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు


హైస్కూల్లో ధ్యాన్‌చంద్, తెలుగుతల్లి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న హెచ్ఎం శ్రీధర్


తాళ్లపాలెంలో తెలుగు సంప్రదాయ వస్త్రధారణలో అలరించిన విద్యార్థులు


తెలుగు తల్లి విగ్రహం వద్ద మాట్లాడుతున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: మండలంలో మామిడిపాలెం హైస్కూల్లో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు తల్లి చిత్రపటాలకు హెచ్ఎం హెచ్.బి.శ్రీధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు శారీరక ఆరోగ్యాన్ని మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడమే కాకుండా క్రమశిక్షణ అలవర్చుతాయన్నారు. తెలుగు గ్రాంథిక భాషను వ్యవహారిక భాషగా మార్చడానికి ఉద్యమించిన గిడుగు రామమూర్తి పంతులు ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగమణి, ఈశ్వర్, లక్ష్మి, వసంతరావు, సుబ్బారావు, రమణి, కరుణ జ్యోతి, సుబ్రహ్మణ్యం, శ్రీను, నూకేశ్వరరావు ప్రసాద్, బాల సత్యవతి, ఎరయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: తెలుగు భాషను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. స్థానిక మెయిన్‌రోడ్‌లో తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు తెలుగు భాషకు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకురావాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో తెలుగు భాష ఆవశ్యకతను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి విన్నకోట నీలేష గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాక కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో గాయిత్రి స్కూలులో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాస రచన, శ్లోకాలు, పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు మాతృభాష తెలుగు ప్రాధాన్యం, గొప్పతనాన్ని, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రధారణతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అలరించారు. హెచ్ఎం వై. నగేష్, ప్రతినిధి బి. రామకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యాపిల్లల అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన శైలజ, పిల్లలు లిన్సి, రిషి

పెందుర్తి: భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులకు ఓ వ్యక్తి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శాంతారావు మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి సమీపంలోని నాయుడుతోట బంటాకాలనీలో నివాసం ఉంటున్న ఉల్లాపు రత్నాకర్, శైలజ(26) భార్యభర్తలు. వీరికి లిన్సి(6), రిషి కుమార్(2) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే శైలజ పిల్లలిద్దరినీ తీసుకుని గత నెల 20న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితులు, తెలిసినవారి ఇళ్ల వద్ద ఆమె కోసం రత్నాకర్ ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో రత్నాకర్ పోలీసులను ఆశ్రయించాడని ఏఎస్ఐ తెలిపారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నందిగామకు అప్పన్న ప్రచార రథం


రథాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటరమణ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఎన్టీఆర్ జిల్లా నందిగామకు శుక్రవారం తరలివెళ్లింది. నందిగామలోని వాసవి మార్కెట్‌లో జరుగుతున్న 43వ గణపతి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా అప్పన్న ప్రచార రథాన్ని వారి అభ్యర్థన మేరకు అక్కడికి తరలిస్తున్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి రథం తరలింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించాలి

కె.కోటపాడు: అనధికారిక లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించినట్లు వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు డి.శ్రీనివాస్, సూర్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ భుజంగరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు.

రోడ్డున పడ్డ ఆటోవాలాలు


కశింకోట స్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్న ఆటో కార్మికులు

కశింకోట: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తుండటంతో ఆటో కార్మికులు వీధిన పడ్డారు. ప్రయాణికులు లేక పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు. కశింకోటలో 80 ఆటోలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా మహిళా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుండే వారు. రోజుకి ఖర్చులు పోనూ రూ.500 వరకు ఆదాయం మిగిలేది. దీంతో కుటుంబ జీవనాన్ని నెట్టుకొస్తుండే వారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో అత్యవసరమైన పనులున్న వారు తప్ప ఆటోల ముఖం చూడటం లేదని వాపోయారు. ప్రయాణికుల కోసం ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోందని, ఇంతలో బస్సు వస్తే ఆటో దిగి వెళ్లిపోతున్నారని ఆటోవాలాలు ఆవేదన చెందుతున్నారు. దీంతో బేరాలు లేక ఆదాయం తగ్గిపోయిందని, రోజుకు రూ.200 మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే తమ కుటుంబాలను ఎలా నెట్టుకు రావాలని మధన పడుతున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు

అనకాపల్లి: వినాయక మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణపతి మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్స్ ఎలక్ట్రిషియన్లు లేదా నిపుణుల ద్వారా విద్యుత్ పనులు చేయించాలన్నారు. తగిన సామర్థ్యం ఉన్న ఫ్యూజ్ వాడాలని, ఓవర్ లోడ్ అయ్యేంత ఎక్కువ పరికరాలు ఒకే లైన్లో పెట్టకూడదన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన వైర్లు మాత్రమే వాడాలన్నారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు కనీస దూరంలో మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్ఈడీ లైట్లు వాడాలని వీటి ద్వారా తక్కువ విద్యుత్‌ను వాడవచ్చన్నారు. పిల్లలను మీటర్లు, వైర్ల దగ్గరికి అనుమతించవద్దన్నారు. అత్యవసర సమయంలో 1912కు ఫోన్ చేయాలని, వర్షాకాలంలో విద్యుత్ పరికరాలు తడవకుండా చూడాలన్నారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


సర్టిఫికెట్లు పొందిన క్రీడాకారులతో ముఖ్య అతిథులు

అనకాపల్లి టౌన్: ఒలింపిక్ హాకీ క్రీడలో మూడుసార్లు బంగారు పతకాలు సాధించిన ఘనత మేజర్ ధ్యాన్‌చంద్‌దని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తెలిపారు. స్థానిక రైతు భారతి హాల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ సేవలు దేశానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జైవీర్, గలగా నారాయణరావు, నేషనల్ పవర్ లిఫ్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరుడి సేవలో అమర్‌నాథ్


వినాయకుడిని దర్శించుకుంటున్న గుడివాడ అమర్‌నాథ్

చోడవరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి గణేష్ ఆధ్వర్యంలో పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల వినాయకుడిని అమర్‌నాథ్ దర్శించుకున్నారు. సద్భావన కమిటీ ప్రతినిధులు అమర్‌నాథ్‌కు సాదర స్వాగతం పలికారు. కమిటీ ప్రతినిధులను అమర్‌నాథ్ అభినందించారు. అనంతరం పీఎస్‌పేటలో శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో జరిగిన నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమర్‌నాథ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణల పేరిట దోపిడీ


బషీర్‌బాగ్ మృతులకు నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

పరవాడ: ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను మరింత దోపిడీ చేయాలని చూస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆరోపించారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 25 ఏళ్ల క్రితం పోరాటం చేస్తూ బషీర్‌బాగ్‌లో పోలీసు కాల్పుల్లో మరణించిన బాలస్వామి, సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డిల చిత్రపటాలకు లంకెలపాలెం కూడలిలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచారని ఆక్షేపించారు. దుకాణాలకు అమర్చిన స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అప్పారావు, గంగరాజు, వెంకటరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు


కుంభప్రోక్షణలో ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై శ్రీనృసింహ హోమం ఘనంగా జరిపారు. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు మధ్యలో నిలిచిపోయిన టిప్పర్


ట్రాఫిక్‌ను క్లియర్ చేయిస్తున్న రావికమతం ఎస్ఐ రఘువర్మ

రావికమతం: రావికమతం – తోటకూరపాలెం మార్గంలో దాసరయ్యపాలెం వద్ద ట్రాఫిక్ అంతరాయం కారణంగా శుక్రవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాసయ్యపాలెం వద్ద నల్లరాయితో వెళ్తున్న టిప్పర్ లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. దీంతో రావికమతం నుంచి తోటకూరపాలెం వెళ్లే వాహన చోదకులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, మండలానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ రఘువర్మ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోతిలో కూరుకుపోయన టిప్పర్ లారీని పొక్లెయిన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

కశింకోటలో వాహనాల తనిఖీ

కశింకోట: స్థానిక పోలీసు స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎస్. లక్ష్మణరావు తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులకు చలానాలు రాసి అందజేశారు. సరైన రికార్డులు, లైసెన్స్ వగైరా లేని వాహన చోదకులకు చలానాలు అందించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించి అవగాహన కలిగించారు.

గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా వాసు

అనకాపల్లి: గణేష్ ఉత్సవ కమిటీ నియోజకవర్గ కన్వీనర్‌గా దాడి వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మెయిన్‌రోడ్డు ప్రైవేట్ భవనంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కమిటీ కో–కన్వీనర్లుగా బుద్ధ సీతారాం, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విల్లూరు శ్రీనివాసరావు, కమిటీ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.